క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె రూరల్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె ఎస్‌ఐ దుగ్గిరెడ్డి సూచించారు. గురు వారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ లలిత ఆధ్వర్యంలో సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు తమ సెల్ ఫోన్స్‌కు వచ్చే అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, రామకృష్ణ, సీతమ్మ, కౌసల్యదేవి, నాగరాజారెడ్డి, రామన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లె : మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు టంగుటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భజన కళాకారుడి మృతి



బయపురెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి భజన మండలికి చెందిన కళాకారుడు పేరం బయపురెడ్డి(52) గుండెపోటుతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్కడే కోలుకోలేక మృతి చెందాడు.

30న ఉపాధ్యాయుడి అక్రమ సస్పెన్షన్‌పై విచారణ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడి అక్రమ సస్పెన్షన్‌పై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. హిందీ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ సమాచారహక్కు చట్టం దుర్వినియోగం చేశారని 2022వ సంవత్సరంలో అప్పటి హెచ్‌ఎం రామచంద్రారెడ్డి సిఫారసు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో సతీష్‌కుమార్ అప్పట్లో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకుకర్నూలు డీఈఓ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన విచారణకు హాజరు కావాలని హెచ్‌ఎంకు నోటీసులు జారీ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు డోన్ విద్యార్థి



శ్రీభవిత

డోన్ టౌన్ : జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పట్టణానికి చెందిన రాజా సూపర్ మార్కెట్ యజమాని నారబోయిన గురు కుమార్తె శ్రీభవిత ఎంపికయ్యింది. నంద్యాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుండి 28వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శ్రీభవిత అండర్ 17లో టీం ఈవెంట్, సింగిల్ ఈవెంట్ బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఈ మేరకు జిల్లా విద్యాధికారి జనార్దన్ చేతుల మీదుగా గురువారం విజేతకు మెడల్స్ బహుకరించారు. డిసెంబరు 17వ తేది నుండి పాట్నాలో జరిగే పోటీల్లో భవిత పాల్గొననున్నట్లు శ్రీసుధస్కూల్ యజమాన్యం తెలిపారు.

జాతీయ పోటీలకు ఉదయ్‌కుమార్



విజయవాడ బందర్ రోడ్‌లో గల ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27,28 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 20 బాయ్స్ గరల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన డిగ్రీ కళాశాల అధ్యాపకులు రామన్న కుమారుడు మల్లాపు ఉదయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో పాల్గొన ఉదయ్ స్టేట్ ఓపెన్ జూనియర్ బాయ్స్ గ్లర్స్ ఫెన్సింగ్‌లో వ్యక్తిగత విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. బీహార్ రాష్ట్రం పాట్నాలో డిసెంబర్ 2వ తేదీ నుంచి జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఫెన్సింగ్ ట్రైనర్ దత్తమునిస్వామి తెలిపారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి 'పూలే'

- జీసీలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె రూరల్ : బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే అని, వారి అభివృద్ధికి జీవితాంతం కృషి చేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహించిందని గుర్తు చేశారు. కాటసాని స్థానిక స్వగృహంలో గురువారం పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీలకు రాజ్యాధికారం రావాలని ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందన్నారు. బీసీలకు వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అత్యున్నతమైన రాజ్యసభ పదవులను ఆర్ కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ, బీదమస్తాన్‌రావుకు ఇచ్చారని, అయితే టీడీపీ అధికారంలోకి రాగానే వారు స్వార్థ ప్రయోజనాలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్ ముందుకు సాగారని, అన్ని సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. మారుమూల పల్లెలోనూ వైద్య సేవలు అందజేశారని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి కార్పొరేట్ విద్యనందించారని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే టీడీపీ ప్రభుత్వం వీటిని ప్రైవేట్ వారికి అప్పగించేందుకు కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. రైతులకు అండగా నిలిచారని, రైతుభరోసా సీజన్‌కు ముందుగా అందజేస్తూ ఆదుకున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ అన్ని వర్గాల ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.

రెడ్‌బుక్ వేధింపులకు బెదరం

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని, వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజలను టీడీపీ నేతలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. మహిళలకు రక్షణ కరువైందని, ప్రశ్నిస్తే కేసులు నమోదు అన్నట్లుగా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రత్యేకించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు బనాయిస్తు ఆరాచకపాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రెడ్‌బుక్ వేధింపులకు బెదిరే ప్రసక్తేలేదని, ప్రజల నుంచే గుణపాఠం చవి చూస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా నాయకులు శివరామిరెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అబ్దుల్‌ఫైజ్, నాయకులు బండిబ్రహ్మానందరెడ్డి, సురేష్, శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఖానిక్, నాగేషుడు, కూరగాయల రహీమాన్, దేవుడు, ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి సర్కార్

టీడీపీ కూటమి సర్కార్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఆర్థిక పరిస్థితి చూస్తే చాలా భయం వేస్తుందంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలంటూ హామీలు గుప్పించిన కూటమి నేతలు అమలు చేయడాన్ని విస్మరించారన్నారు. పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామని మభ్యపెట్టి గద్దెనెక్కిన చంద్రబాబు... ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్ ముగుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని నిలదీశారు. నిరుద్యోగభృతి, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెల రూ. 1500, ఉచిత బస్సు ప్రయాణం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తాం... ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తామంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు అన్నివర్గాలపై భారం మోపుతున్నారని కాటసాని నిలదీశారు. విద్యుత్ చార్జీలు, రోడ్డు టాక్స్ అంటూ భారం మోపుతున్నారన్నారు. అమ్మఒడి, విద్యా, వసతి దీవెనలకు మంగళం పాడిన కూటమి సర్కార్ తీరుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్ : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం జ్యోతిరావుపూలే ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబులాపురం మదన్, ఎంపీటీసీ సభ్యులు ఓబులాపురం సుధాకర్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫీ, బీసీ సంఘం నాయకులు లక్ష్ముంపల్లె ఓబులేసు, రమణ, మహేంద్రనాయుడు, ఎల్లేశ్వర్, పెయింటర్ వెంకటేష్, ధర్మవరం శ్రీను, కౌన్సిలర్లు వెంకట్రాముడు, వంశి, వడ్డె రంగస్వామి, మేకల రాజు, పాలుట్ల రఘురాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేస్తూ నివాళుర్పించారు.

బేతంచెర్ల: సమసమాజ స్థాపనకు జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశాడని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ముర్తుజావలి, చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి ఖాజా అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే 134 వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఇబ్రహీమ్, మధు, కోట్ల మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, సలీం, ఖాజా, వలీబాషా, నిరంజన్ , మనోహర్ నాయుడు, ఎద్దులన్న, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు కౌన్సిలర్ల సమావేశం

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్స్ సమావేశం శుక్రవారం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హరి ప్రసాద్ తెలిపారు. కౌన్సిలర్స్ ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

1న హిందూ సమ్మేళనం

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్1వ తేదీన హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైందవ శంఖారావం మండల కన్వీనర్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. హిందూ దేవాలయాలపై వందల ఏళ్ల నుంచి జరుగుతున్న దాడులు నేటికి కొనసాగుతున్నాయన్నారు. ఆలయాల ఆస్తుల అన్యాక్రాంతం, అన్యమతస్తుల నియామకం వంటి సంఘటనలతో దేవాదాయ శాఖ కలుషితమైందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని దేవాలయాల నిర్వహణ బాధ్యతను హిందూ సమాజానికి అప్పగించాలంటూ లక్షలాది మందితో 2025 జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈమహా ఉద్యమంలో కొలిమిగుండ్ల మండలం నుంచి అత్యధిక మంది పాల్గొనేందుకు డిసెంబర్1న హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులపై ఒత్తిడికి పాల్పడితే చర్యలు

బనగానపల్లె రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఫ్రీ కోటలో భాగంగా ఉచితంగా సీటు పొందిన విద్యార్థులను ఫీజు చెల్లించాలని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవని ఎంఈఓ స్వరూప గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఫీజు చెల్లించాలని ఈ విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడు గౌడల వనభోజనం

బనగానపల్లె రూరల్ : స్థానిక ఎస్సార్‌బీసీ కాల్వ సమీపాన రవ్వలకొండపై నిర్మాణంలో ఉన్న రేణుకా ఎల్లమాంబ గుడి ఆవరణలో శుక్రవారం గౌడ సమాజికర్గం (ఈడిగ)వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. వనభోజన కార్యక్రమంలో భాగంగా ఉదయం సామూహిక గోమాత పూజ, అమ్మవారికి కుంకు మార్చన, పుష్పార్చన, మధ్యాహ్నం ఆధ్యాత్మిక సభ తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గౌడ కులస్తులందరూ పాల్గొని వన భోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



బేతంచెర్లలో శిరిడీ సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక కర్నూలు రహదారిలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో కార్తీక మాసం గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం బాబాకు అభిషేకం, కుంకు మార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయం ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం బాబాకు కార్తీక దీపాల మధ్య భజనలతో పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం శివునికి, ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కృపాధామ కమిటీ సభ్యులు బాబుల్‌రెడ్డి, గుండాగోపాలు, వీర భద్రారెడ్డి పాల్గొన్నారు.




కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

మహిళలతో కిక్కిరిసిన పోస్టాఫీస్

డోన్ టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వ్యక్తి గత ఖాతాల్లో జమ చేస్తారనే ఉద్దేశంతో పోస్టాఫీసులో ఖాతాలు తెరవడానికి మహిళలు పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా మహిళలకు త్వరలో రూ.1,500 జమ చేస్తుందనే ప్రచారం నేపథ్యంలో పోస్టాఫీసులు మహిళలతో కిక్కిరిసిపోతుంది. పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసు కొన్ని రోజులుగా ఖాతాల కోసం జనం క్యూ కడుతున్నారు. రూ.200 చెల్లిస్తే ఖాతా ఓపెన్ చేసి ఎన్‌పీసీఐ లింక్ చేసి ఏటీఎం కార్డు తరహాలో ఒక కార్డు ఇస్తున్నారు పోస్టాఫీసు అధికారులు. అయితే కట్టిన రెండు వందల రుపాయల్లో లబ్దిదారుల ఖాతాల్లో కేవలం రూ.24 జమ అవుతున్నట్లు ప్రజల సెల్ ఫోన్లకు మెస్సేజ్‌లు వస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

వీరాంజనేయస్వామి సన్నిధిలో నిత్యాన్నదానం



అన్నదానం స్వీకరిస్తున్న హనుమాన్ మాలధారులు

డోన్ : పట్టణంలోని పాతపేట ద్రోణపురి వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులకు గురువారం నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం వనభోజన కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ద్రోణపురి వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సహకారంతో నిత్యాన్నదానం చేపడుతున్నామని ప్రధాన అర్చకులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

డోన్ రూరల్ : ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే ఎంతటి వారినైనా వదిలేదే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు నెలలుగా 44 సారా కేసులు, 24బెల్ట్ షాపులకు సంబంధించి నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవ్వరైనా నాటు సారా, అక్రమ మద్యం అమ్మితే క్రిమినల్ కేసుల నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింహ గర్జన సభను జయప్రదం చేయాలి



సంఘీభావం తెలియజేస్తున్న మాలమహానాడు సంఘం నాయకులు

కోవెలకుంట్ల: మాలల హక్కుల పరిరక్షణకు నిర్వహించ తలపెట్టిన సింహ గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు ఆవుల దేవరత్నం అన్నారు. గురువారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు డిసెంబర్ 1వ తేదీన హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన సింహగర్జనకు మాలలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది సాంబశివుడు, నాయకులు పుల్లయ్య, భాస్కర్, శేఖర్, ఇస్మాయిల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే కోసం దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల: భూముల రీసర్వే కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల సర్వేయర్ సరిత గురువారం తెలిపారు. ఎనిమది గ్రామాల్లో భూముల సర్వే జరిగిందన్నారు. ఇటీవలనే గ్రామాల్లో రైతులతో గ్రామ సభలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 112 మంది రైతులు వివిధ రకాల సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

డోన్ : హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యపడుతుందని ప్రభుత్వ గుండారత్నం వెంకటశెట్టి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం హెచ్‌ఐవీపై హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

30న మాదిగల వనభోజనం

డోన్ టౌన్ : అరుంధతి జాంభవ మాదిగ ఐక్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో మాదిగల వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీస్ నాయకుడు గుండా ఈశ్వరయ్య మాదిగ తెలిపారు. కార్యక్రమానికి మాదిగలు తరలివచ్చి ఐక్యత చాటుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పులి కేశవయ్య, రాముడు, మద్దిలేటి, రామాంజనేయులు, చిన్నరాయుడు, గంధం శ్రీను, మాధవకృష్ణ, పెద్ద గిడ్డయ్య, మద్దయ్య, భూమనాగన్న, విజయభాస్కర్, పెద్దయ్య, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

బనగానపల్లెరూరల్ : మండలంలోని యాగంటిపల్లె, పాతపాడు గ్రామ సచివాలయాలను ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పు డు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు.

30 న సబ్‌పోస్టాఫీసు నిర్మాణానికి శంకుస్థాపన

ప్యాపిలి: స్థానిక సబ్‌పోస్టాఫీసు నూతన భవన నిర్మాణ పనులకు ఈ నెల 30 శంకుస్థాపన చేయనున్నట్లు డోన్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మాహేశ్వర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక సర్పంచ్ చెవిటి లక్ష్మీదేవితో పాటు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌పోస్టాఫీసు భవన నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

కాల్వ ఇలా.. నీరు పారేదెలా?



ఎస్సార్‌బీసీ కాల్వలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

సంజామల: ఎస్సార్‌బీసీ కాల్వలో కంపచెట్లు, పూడిక పేరుకపోయింది. దీంతో సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కాల్వలు ఇలా ఉంటే నీరు పారేది ఏలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఎస్సార్‌బీసీ బ్లాక్ నెంబర్ 13,10ఎల్, 11ఆర్ మైనర్ కాల్వ నిండా కంపచెట్లు నిండిపోయాయి. దాదాపు 100 ఎకరాలకు పైగ ఈ కాల్వ ద్వారా సాగు నీరు అందాలి. ఈ కాల్వ కింద మిర్చి, వరి, మొక్కజొన్న, మినుము, కంది, జొన్న తదితర పంటలు సాగు చేశారు. పంట పూతకు వచ్చే దశలో సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాల్వలో ముళ్లపొదలు, పూడిక పనులు చేయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా రైతు బజారు!



బేతంచెర్ల పట్టణంలో నిరుపయోగంగా ఉన్న రైతు బాజారు

బేతంచెర్ల: రైతులు పండించిన కూరగాయలను పట్టణంలోనే విక్రయించుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రైతు బజారు నిర్మాణానికి రూ. 27 లక్షల నిధులు మంజూరయ్యాయి. రైతు బజారును ఈయేడాది మార్చి 14న ప్రారంభించారు. రైతు బజారు ప్రారంభించి 9 నెలలు అవుతున్నా రైతుల కూరగాయలు విక్రయించేందుకు అందుబాటులోకి తీసుక రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని రైతు బజారు వినియోగంలోకి తీసుకరావాలని పట్టణ ప్రజలు, రైతులు కోరుతున్నారు. రైతు బజారు వినియోగంలోకి వస్తే అటు రైతులతోపాటు ఇటు పట్టణ ప్రజలకు తక్కువ ధరలకు కూరగాయలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిన కలెక్షన్ సెంటర్ గోడౌన్

పూల కలెక్షన్ గౌడౌన్ అంతేనా?

మండలపరిధిలోని గోరుమానుకొండ మెట్ట వద్ద కర్నూలు రహదారిలో 10 నెలల క్రితం ఉద్యాన శాఖ, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూ. 15 లక్షలతో కలెక్షన్ సెంటర్ గోడౌన్ నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తుంది. రూ లక్షలు వెచ్చించి నిర్మించిన గోడౌన్ నిరుపయోగంగా మారింది. గోరుమానుకొండ, సీతారామాపురం, యంబాయి, శంకరాపురం, ఎం, పేండేకల్లు, కొలుముల పల్లె గ్రామాల రైతులు పండించిన కూరగాయలు, పూలు విక్రయించుకునేందుకు గొడౌన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించి గౌడౌన్‌ను రైతులకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల రైతులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రాలుతున్న కంది పూత !



వాడుపట్టిన కంది పూత

బనగానపల్లె : అల్పపీడన ప్రభావంతో నెలకొన్న తుపాన్ ప్రభావంతో కందిపంటకు నష్టం వాటిల్లుతుంది. బనగానపల్లె నియోజకవర్గంలో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 5వేల హెక్టార్లలో కంది పంటను సాగు అయ్యింది. బనగానపల్లె మండలంలోనే 2వేల హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. అయితే పంట ఏపుగా పెరిగి పూత, పిందే దశలో ఉన్నది. గిట్టుబాటు ధర క్వింటాం రూ.9-10వేలు ఉన్నందున మంచి దిగుబడి లభించి మిగులు లభిస్తుందని రైతులు భావించారు. అయితే తుపాన్ ప్రభావంతో అకాశం మబ్బులుగా ఉండి అక్కడక్కడ తుంపర్ల పడడంతో పూత పిందే నేలరాలుతుంది. దీంతో నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ రెండు రోజుల నుంచి తుపాన్ ప్రభావం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొనడంతో మరింత నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల వాదీగా పర్యటించి పంట నష్ట నివారణకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.